క్లుప్తంగా

బాధ్యతగా పారిశుధ్య పనులు



పెదపూడిలో చెత్త తొలగింపు పనులు పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ శ్రీనివాసు చౌదరి

పెదపూడి: గ్రామాల్లో పారిశుధ్య పనులు బాధ్యతగా చేపట్టడానికి సచివాలయ కార్యదర్శులు కృషి చేయాలన్నారు. ఆయన పెదపూడి, దోమాడ, కరకుదురు గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన గ్రామాల నిర్మాణానికి అధికారులు కృషి చేయాలన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో స్వచ్ఛ హి సేవా కార్యక్రమం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమం అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహించాలన్నారు. దీనిలో భాగంగా గ్రామాల్లో పారిశుధ్యాన్ని మరింత మెరుగుపర్చాలన్నారు. అధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు. ఎక్కడ అపరిశుభ్రత నెలకొన్నా సంబంధిత అధికారులపై తగిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలన్నారు. కార్యదర్శులు సుబ్రహ్మణ్యం, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

ఘనంగా పోషకాహార మాసోత్సవాలు



కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు

సీతానగరం: ముగ్గళ్ల సెక్టార్‌లోని 24 అంగన్‌వాడీ సెంటర్లన్నీ కలిసి శుక్రవారం ముగ్గళ్ల ఎస్సీ కమ్యూనిటీ హాల్లో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించాయి. ఐసీడీఎస్ సీడీపీవో జె.ఝాన్సీరాణి, సూపర్‌వైజర్ పి.వరలక్ష్మి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. తక్కువ ఖర్చుతో తయారు చేసుకోగలిగే, ఎక్కువ పోషక విలువలున్న తాటి గారెలు, రాగిలడ్డూ, జొన్న గోధుమ రాగులతో హల్వా, ఆకు కూరలతో చపాతీలు, గుడ్లతో జున్ను, అటుకులతో ఉప్మా, మొక్కజొన్న వంటకాలు తదితర 30 రకాలను ప్రదర్శించారు. చిరుధాన్యాలు, ఆకు కూరలు, జామపండ్లు, బత్తాయి, దోస, దానిమ్మ, నారింజ వంటి పలు రకాల పండ్లను ప్రదర్శించారు. అంగన్‌వాడీ టీచర్లు పి.సుబ్బలక్ష్మి, సీహెచ్ సువర్ణ, జి.దుర్గ, ఎస్.రోహిణి, ఎ.సత్యవతి, జి.సుజాత, కె.కృష్ణవేణి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు

కాగడాల ప్రదర్శన

మధురపూడి: తెలుగుదేశం పార్టీ నాయకులు శుక్రవారం సాయంత్రం కోరుకొండలో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి ఆధ్వర్యంలో లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం నుంచి బస్టాండ్ వరకూ ఈ కార్యక్రమం జరిగింది. చంద్రబాబును విడుదల చేయాలంటూ నినాదాలు చేశారు.

అన్న సమారాధన

రంగంపేట: మండల పరిధిలోని వడిశలేరు గ్రామంలో గల గొల్లపుంత వీధిలో ఉన్న శ్రీకృష్ణ ఆలయం వద్ద శ్రీకృష్ణ జన్మాష్టమి ముగింపు ఉత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం అన్న సమారాధన నిర్వహించారు. స్థానిక భక్తులతో పాటు, చుట్టుపక్కల గ్రామాలవారు పాల్గొని శ్రీకృష్ణ భగవానుని దర్శించుకుని అన్న ప్రసాదం స్వీకరించారు.

క్రైం సీఐగా విద్యాసాగర్



ఎస్పీ జగదీష్‌ను కలసిన సీఐ విద్యాసాగర్

కంబాలచెరువు: రాజమహేంద్రవరం వన్‌టౌన్ క్రైం సీఐగా సీహెచ్ విద్యాసాగర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఎస్పీ పి.జగదీష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. విద్యాసాగర్ ఇప్పటివరకూ జగ్గంపేట ఎస్సైగా పనిచేశారు. పదోన్నతిపై వన్‌టౌన్‌కు సీఐగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు.

డైట్‌లో కార్యశాల

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జిల్లా ప్రభుత్వ విద్యాశిక్షణాసంస్థ (డైట్)లో శుక్రవారం 8, 9 తరగతుల జీవశాస్త్ర పాఠ్యపుస్తకాలలో కఠిన అంశాల గుర్తింపుపై కార్యశాల నిర్వహించారు. మూడు జిల్లాల నుంచి 8, 9 తరగతులకు జీవశాస్త్రం బోధిస్తున్న ఉపాధ్యాయులు హాజరై వివిధ అధ్యాయాలలో కఠిన తరమైన అంశాలను గుర్తించారు.

అవగాహన సదస్సు

కడియం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సమాచార హక్కుచట్టంపై శుక్రవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. దామిశెట్టి నాగరాజు, పళ్ల వెంకటేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సమాచార హక్కుచట్టం జాతీయ కన్వీనర్ వరదా నాగేశ్వరరావు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ తదితరులు మాట్లాడారు.

ఆగని ఎలక్కొట్టుడు



- వరి పొలాలను నాశనం చేస్తున్న మూషికాలు
- ఆందోళనలో అన్నదాతలు

పెదపూడి: ఆరుగాలం కష్టించి పంట పండించే రైతన్నకు ఎలుకల బాధ తప్పడం లేదు. ప్రతి ఏడాది ఎదుర్కొనే దాని కంటే ఈ ఖరీఫ్ సీజన్లో ఎక్కువగా పంటను నాశనం చేస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎలుకల సాముహిక నివారణకు వ్యవసాయ శాఖ అధికారులు బ్రోమోడయోలిన్ అనే మందును పంపిణీ చేసినప్పటికి ఎలుకల నివారణ సాధ్యం కాలేదని రైతులు వాపోతున్నారు. దీంతో ఎలుకల పొలాలను నాశనం చేస్తున్నాయి. ఎలుకల నివారణకు రైతులు ఎలుకల బుట్టలు పెట్టించినా, మందు బొరియల వద్ద పెట్టినా వాటి ఉద్ధృతి తగ్గలేదని రైతులు అంటున్నారు. ప్రస్తుతం వరి పంట చిరుపొట్ట దశకు చేరుకుంది. ఎలుకల అధికంగా ఉండి వరిని కొరికి పాడు చేస్తునాయి.

అనపర్తి నియోజకవర్గంలో 46,067 ఎకరాల్లో వరి సాగు

అనపర్తి మండలంలో 9,550 ఎకరాలు, పెదపూడిలో 18,000, రంగంపేటలో 2,776, బిక్కవోలులో 15,741 మొత్తం అనపర్తి నియోజకవర్గంలో 46,067 ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేస్తున్నారు. అయితే నియోజకవర్గంలో అనపర్తి, పీరా రామచంద్రపురం, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి, రామేశ్వరం, కాండ్రేగుల, శహపురం, కరకుదురు, జి.మామిడాడ, పెద్దాడ, సంపర తదితర గ్రామాల్లో రైతులు పొగ, బుట్టల ద్వారా ఎలుకలను నిర్మూలించే కార్యక్రమాలు చేపడుతున్నారు.

సంతానోత్పత్తి ఎక్కువ

ఎలుక జీవిత కాలం రెండేళ్లు. ఒక ఆడ ఎలుక పుట్టిన ఐదు వారాలకే పిల్లలను కనే శక్తి సంతరించుకుంటుంది. ఒక కాన్పులో సగటున ఏడు పిల్లలు పుడతాయి. ఒక జత మగ, ఆడ ఎలుక కలిసినప్పటి నుంచి ఏడాదిలో 800 నుంచి 1,200 వరకు పిల్లలు పుడతాయని అధికారులు చెబుతున్నారు. ఎలుక పళ్లు రోజుకు 0.3 మిల్లీ మీటర్ల పెరుగుతాయి. వాటిని అరగదీసుకోకపోతే కొద్ది రోజుల్లో దాని నోరు మూత పడదు. దీంతో రోజులో ఎక్కువ భాగం ఏదో ఒక దానిని కొరుకుతూనే కాలాన్ని గడపుతాయని, వరి పంట కాలంలో ఎలుకల సంతానోత్పత్తి ఎక్కువగా ఉండి పొలాలపై దాడి చేస్తుంటాయని వ్యవసాయాధికారులు అంటున్నారు.

ఎకరాకు నాలుగు బస్తాలు నాశనం

ఎకరం పొలంలో 25 నుంచి 30 వరకు ఎలుక బొరియలు ఉండి, సుమారు 10 నుంచి 15 శాతం వరకు పంటను ఎలుకలు నష్ట పరుస్తాయని అంచనా. వీటి నిర్మూలనకు ఒక్కో రైతూ సుమారు రూ.6 వేల నుంచి రూ.7 వేలు ఖర్చు చేస్తున్నప్పటికీ తగిన ఫలితం ఉండడంలేదని అంటున్నారు.

వేటగాళ్లే దిక్కు

ఎలుకలకు తెలివి తేటలు ఎక్కువ ఉంటాయని, ఎలుకలు ముందుగానే రైతులు వాడే మందు వాసనను, ఎరలను పసిగట్టి వాటికి ఆమడ దూరం వెళ్లిపోతున్నాయని, కనీసం వారు పెట్టిన మందును గాని, ఎరలను గాని అవి ముట్టుకోవడం లేదని రైతులు వివరిస్తున్నారు. అందుకే ఎలుకల వేటగాళ్లను ఆశ్రయిస్తున్నామంటున్నారు.



పెద్దాడలో ఎలుకల దాడిలో పాడైన పొలం



పెద్దాడలో ఎలుకలను పడుతున్న వేటగాళ్లు

27న నిర్మూలన

ఈ నెల 27న సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం నిర్వహించనున్నాం. ప్రతి పంటకు ఎలుకల మందు పంపిణీ చేస్తాం. ఎలుకల ఎకరా పంటలో సుమారు నాలుగు బస్తాల ధాన్యాన్ని నాశనం చేస్తాయి. రైతులందరూ సామూహికంగా ఎలుకలు నిర్మూలించుకోవాలి. ప్రభుత్వం అన్ని రకాలుగా సహకారం అందిస్తుంది.

–టీవీఆర్ మణిదీప్, వ్యవసాయశాఖాధికారి పెదపూడి మండలం



ఒక ఎలుకను పట్టుకుంటే రూ.100

ఒక్కో ఎలుకను పట్టి చంపినందుకు వేటగాళ్లు రూ.100 డిమాండ్ చేస్తున్నారు. ఎలుకల బుట్టలు పెడితే ఆ బుట్టల్లో పడిన ఎలుకకు రూ.100 చెల్లించాల్సిందే. అధికంగా ఖర్చవుతున్నా పంటను కాపాడుకోవడానికి భరించాల్సి వస్తోంది.

– టి.సత్యనారాయణ రైతు, కరకుదురు,



ఎనిమిది మందికి రైతునేస్తం రుణాలు



రైతునేస్తం రుణాల చెక్కులు అందుకుంటున్న రైతులు

సీతానగరం: మండలంలోని రఘుదేవపురం పీఏసీఎస్ ద్వారా ఎనిమిది మందికి రైతునేస్తం రుణాలు అందజేశారు. ఈ మేరకు శుక్రవారం ఆ రైతులకు రూ.65 లక్షల విలువైన చెక్కులను నోడల్ ఆఫీసర్ ఎ.ఉమారాణి, డీసీసీబీ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ కార్తిక్ రెడ్డి, సూపర్ వైజర్ ఆలీబాబా, పీఏసీఎస్ చైర్ పర్సన్ నిడదవోలు శ్రీనివాస్, సీఈవో ములగాల రామకృష్ణ అందజేశారు. రుణాలు పొందిన వారిలో యలమాటి సురేష్ కుమార్, పాలకుర్తి వెంకట రామారావు, పాలకుర్తి శివ రామలక్ష్మి, గుర్రం శ్రీనివాస్, సయ్యద్ శ్రీను, కొల్లేపర నాగ మల్లికార్జునరావు, వేగి శ్రీనివాస్, శుద్దపల్లి సత్యవతి ఉన్నారు. నోడల్ ఆఫీసర్ ఉమారాణి మాట్లాడుతూ సెంట్రల్ బ్యాంక్ రైతునేస్తం అనే కొత్తగా స్కీమ్ పెట్టిందని, రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దీనిద్వారా ఒక్కొక్కరికీ ఎకరానికి రూ.8 లక్షలు చొప్పున రూ.35 లక్షల వరకూ రుణంగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో డీసీబీబీ సిబ్బంది జి.ప్రసాద్, పి.మహేష్, అనిల్ పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక అభ్యున్నతే సీఎం జగన్ ఆశయం



ముక్కినాడలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి

రాజానగరం: రాష్ట్రంలో ప్రతి మహిళా ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నదే ముఖ్యమంత్రి జగన్ ఆశయమని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. మండలంలోని ముక్కినాడ, మల్లంపూడి గ్రామాల్లోని స్వయం సహాయక సంఘాల మహిళలతో శుక్రవారం ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాలలో మహిళలకే అగ్రాసనం వేస్తున్నారన్నారు. డ్వాక్రా సంఘాల రుణాలను మాఫీ చేస్తానంటూ గతంలో చంద్రబాబు ఏవిధంగా మోసం చేశారో గుర్తు చేసుకోవాలన్నారు. రాబోయే ఎన్నికలలో జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రిని చేసే విధంగా వైఎస్సార్ సీపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి, మహిళా శక్తిని చాటాలని అన్నారు. సమావేశాలలో వెలుగు ఏపీఎం హేమ నాగలక్ష్మి, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

‘నన్నయ’లో ఈసీ మెంబర్‌కు సత్కారం



ఈసీ మెంబర్ నారాయణరావును సన్మానిస్తున్న దృశ్యం

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ పాలక మండలి సభ్యులుగా ఉన్న గంధం నారాయణరావును బీఈడీ కాలేజెస్ కరస్పాండెంట్స్ అండ్ ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనగా సన్మానించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య కె.పద్మరాజు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగిగా 35 సంవత్సరాలు సేవలందించిన నారాయణరావు లిటిల్ రోస్ విద్యా సంస్థల చైర్మన్‌గా, అసోసియేషన్ గౌరవాధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారన్నారు. విద్యావేత్తగా ఎంతో అనుభవశాలి అయిన ఈయనను ఈసీ మెంబరుగా నియమించడం హర్షణీయమన్నారు. గోదావరి జిల్లాలలో బీఈడీ కళాశాలల బలోపేతానికి కృషి చేయాలన్నారు. గంధం నారాయణరావు మాట్లాడుతూ ఇందుకు కారకులైన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, సీడీసీ డీన్ ఆచార్య కేవీస్ రమేష్, ఎడ్యుకేషన్ బీఓఎస్ చైర్మన్ డాక్టర్ కె.సుబ్బారావు, అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎం.శివకుమార్, ఉపాధ్యక్షుడు బి.సత్యనారాయణ, కార్యదర్శి సువర్ణ కుమార్ పాల్గొన్నారు.

ఇంటింటికీ జగనన్న సురక్ష సర్వే



పందలపాకలో జగనన్న సురక్ష సర్వే చేస్తున్న ఆరోగ్య సిబ్బంది



గోకవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బిక్కవోలు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కొంకుదురు పీహెచ్‌సీ వైద్యురాలు విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం కొమరిపాలెం, పందలపాక గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఉచిత వైద్య సేవలు అందుతున్నాయన్నారు. ఏమైనా సమస్యలుంటే యాప్‌లో నమోదు చేయాలన్నారు. పందలపాక సచివాలయం 1 పరిధిలో 1,428 కుటుంబాలకుగాను 719 కుటుబాల సర్వే పూర్తయిందన్నారు. కొమరిపాలెం సచివాలయం1 పరిధిలో 1,148 కుటుంబాలకు గాను 343 కుటుంబాలను సర్వే చేశారని తెలిపారు. సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి, పీహెచ్ఎన్ ఎన్.విజయలక్ష్మి, ఏఎన్ఎం కూండపు అనంతలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ ఇ.పాప, ఆశ వర్కర్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పకడ్బందీగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

రంగంపేట: మండలంలోని ప్రతీ గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమాన్ని వైద్య, ఆరోగ్య సిబ్బంది పకడ్బందీగా నిర్వహించాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రామ్‌భాస్కర్ సూచించారు. శుక్రవారం పీహెచ్‌సీ వద్ద ఆశాలకు, ఏఎన్ఎంలకు, ఎంఎల్‌హెచ్‌పీలకు ఆయుష్మాన్ భవ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రతీ ఇంటి వద్ద సర్వేలో ఏడు రకాల పరీక్షలు నిర్వహించి, మిగతా పరీక్షలు అవసరమైన వారిని ఆయా గ్రామాల్లో జరిగే వైద్య శిబిరాల్లో పరీక్షలు చేయాలన్నారు. సీహెచ్ఓ కె.జయమణి, ఎంపీహెచ్ఈఓ పి.ప్రసాద్, పీహెచ్ఎన్ ఎల్.గంగాభవానీ, హెచ్‌వీలు పాల్గొన్నారు.

గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష

గోకవరం: మండలంలోని ఇటికాయలపల్లి, కామరాజుపేట, కొత్తపల్లి, రంపయర్రంపాలెం, తంటికొండ, గోకవరం, వీరలంకపల్లి గ్రామాల్లో వైద్య సిబ్బంది జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య వివరాలను తెలుసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ కార్యక్రమాన్ని కొత్తపల్లి, గోకవరం ప్రభుత్వాస్పత్రి డాక్టర్లు తిరన్, అలేఖ్య, నిఖిత, ఎంపీహెచ్ఈఓలు శంకర్, మూర్తిలు పరిశీలించి పలు సూచనలు చేశారు. సెప్టెంబర్ 30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాలకు వచ్చి ప్రజలు వైద్య సేవలను ఉపయోగించుకోవాలన్నారు.

జిల్లా స్థాయి క్రీడా పోటీలకు రంగంపేట విద్యార్థులు



జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

రంగంపేట: అనపర్తిలో జరిగిన నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో రంగంపేట విద్యార్థులు ప్రతిభచూపి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయినట్టు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీడీ కె.శైల తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ నియోజక వర్గ స్థాయిలో జరిగిన వాలీబాల్, త్రోబాల్, కబడ్డీ, కోకో, అథ్లెటిక్స్‌లో రంగంపేట ఉన్నత పాఠశాలకు చెందిన చాగంటి యశస్విని, కె.జాహ్నవి, యవ్వన లక్ష్మి, జి.అరుణకుమారి, నాగ సౌజన్య, లలిత కళామణి, డి.పార్థసారధి, కె.సంతోష్, సూర్య చరణ్, మణికంఠ, దుర్గాప్రసాద్, మణికంఠరాజు, మహేష్, చైతన్య, చక్రవర్తి, కీర్తన, యామిని, దేవిన ధన్యత, దేవిశ్రీ, శ్రావ్య, శ్వేత జిల్లా స్థాయికి ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులను, పీడీ శైలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారధి, ఉపాధ్యాయులు అభినందించారు.

వినాయకునికి ప్రత్యేక పూజలు



పందలపాకలో ప్రత్యేక పూజలు అందుకున్న వినాయకుడు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలులో కొలువైన ఉన్న శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం ఆలయం వద్ద చెక్కా సత్యనారాయణ, వీర్రాఘవమ్మ దంపతులు, చెక్కా వీరభద్రరావు అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తమ్మిరెడ్డి నాగశ్రీనివాస్‌రెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు. కొంకుదురు వంతెన దిగువ వద్ద కొలువైన శ్రీ లక్ష్మీ గణపతి నవరాత్ర మంటపం వద్ద శుక్రవారం ఉదయం పదివేల ఉండ్రాళ్లతో గణపతికి పూజ నిర్వహించారు. మహిళలు 108 ఉండ్రాళ్ల చొప్పున స్వామికి నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమం అర్చకులు రమణ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. పందలపాక వినాయక్‌నగర్‌లో ఏర్పాటు చేసి వినాయక మంటపం వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో దీపోత్సవం

మధురపూడి: కోరుకొండ మండలం గాడాల గ్రామంలోని వినాయక వెంకటసాయి ఆలయంలో శుక్రవారం రాత్రి దీపోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. చవితి ఉత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది. అలాగే మండలంలోని వివిధ గ్రామాల్లో స్వామివారికి పూజలు నిర్వహించారు. గాడాల వినాయక వెంకటసాయి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. ఉదయం నుంచి స్వామివారికి విశేషంగా అర్చనలు నిర్వహించారు.

నేడు భజన పోటీలు

స్వామివారి ఆలయంలో శనివారం మహిళా భజన పోటీలు నిర్వహించనున్నారు. ఇందులో ఐదు గ్రామాలకు చెందిన మహిళా భజన సంఘాలకు చెందిన వారు పాల్గొంటారు. బూరుగుపూడి, దోసకాయలపల్లి, కోరుకొండ గ్రామాల్లో స్వామివారికి విశేషంగా పూజలు జరిగాయి.

వైభవంగా చవితి సంబరాలు

అనపర్తి: మండలంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గ్రామాల్లో వివిధ కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన మంటపాల్లో విఘ్నేశ్వరుని ఆలయాల్లో ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో జరుగుతున్న నిత్య పూజలు, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొంటున్నారు. శుక్రవారం స్థానిక పాతవూరు మసీద్ సెంటర్లో కొలువుతీర్చిన శ్రీ బాలగణపతి యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మంటపంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు అన్న సమారాధన జరిపారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు జయప్రదం చేయాలి



ప్రచారయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) స్వర్ణోత్సవాలను జయప్రదం చేయాలని ఆశాఖ జిల్లా అధ్యక్షుడు జయకర్ కోరారు. జిల్లా కార్యాలయంలో ఫెడరేషన్ ప్రచార యాత్ర, 50 సంవత్సరాల పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఫెడరేషన్‌ను 1974లో స్థాపించారని, ఈ నేపథ్యంలో శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి విజయవాడ వరకూ ప్రచారయాత్ర ప్రారంభమైందన్నారు. అలాగే అనంతపురం జిల్లా హిందూపురం నుంచి విజయవాడ వరకూ రెండో ప్రచార యాత్ర జరుగుతోందన్నారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల అధ్యయనం కోసం ఈ రెండు ప్రచార జాతాలు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పర్యటిస్తున్నాయన్నారు. ప్రాథమిక విద్యారంగం బలోపేతానికి మేధావులతో చర్చించి చర్యలు చేపట్టాలన్నారు. ప్రచార యాత్ర ఈనెల 24న మన జిల్లా గోకవరంలో ప్రవేశించి, 25న అనపర్తి నుంచి కాకినాడ జిల్లాకు వెళుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి షరీఫ్, ఈవీఎస్ఎస్ఆర్ ప్రసాద్, విజయ గౌరీ, రమేష్, రవి, తాతారావు, ప్రకాష్, శ్రీనివాస్, విజయ్‌బాబు, అనిత పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

రాజమహేంద్రవరం సిటీ: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన సేవా పక్షోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా నగరంలోని బీజేపీ కార్యాలయంలో యువ మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. యువమోర్చా జిల్లా అధ్యక్షుడు కందుకూరి మనోజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు ప్రారంభించారు. మనోజ్ మాట్లాడుతూ 94 మంది యువ మోర్చా, పార్టీ నాయకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారని, వారికి సర్టిఫికెట్లు అందజేశామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, బేతిరెడ్డి ఆదిత్య, కండికొండ రమేష్, యెనుముల రంగబాబు, కురగంటి సతీష్, కాలెపు సత్యసాయిరామ్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందనలు



ప్రతిభ చూపిన పందలపాక హైస్కూల్ విద్యార్థులతో ఉపాధ్యాయులు



వెదుళ్లపల్లి విద్యార్థులతో ఉపాధ్యాయులు

బిక్కవోలు: పందలపాక పడాల పెద్ద పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ నెల 19, 20, 21, తేదీలలో అనపర్తి ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జరిగిన నియోజకవర్గ స్థాయి పోటీలలో వీరు ప్రతిభ కనబరిచారని చెప్పారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో పీడీ దార్వంపూడి యువరాజారెడ్డి, విద్యార్థులు కొమ్ము జాహ్నవి, వి.శరణ్య, సత్యవతి, పునిత్, బి కిశ్య, పి.దివ్యశ్రీ, సుస్మిత, పడాల శ్రీనివాసరెడ్డి, వి.దీపక్, ఎం.అవినాష్‌లను ఆయన అభినందించారు.

మెళ్లూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు కె.రఘురామ్, కె.అనిల్, ఎస్.లీలామహీధర్, ఎస్.ప్రసాద్, కె.సాయిరామ్ చరణ్, ఎస్.వీరప్రతాప్, జి.దుర్గ, డి.దర్శిని, కె.వర్షిణి, ప్రజ్ఞదరసి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయినట్లు పాఠశాల హెచ్‌ఎం జి.లక్ష్మి తెలిపారు. పీడీ ఎండీ బషీర్, విద్యార్థులను ఆమె అభినందించారు.

సీతానగరం: వెదుళ్లపల్లి హైస్కూల్‌కు చెందిన 24 మంది విద్యార్థులు జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయురాలు లంకా సీతారత్నం తెలిపారు. రాజానగరం హైస్కూల్లో ఈ నెల 20, 21 తేదీల్లో జరిగిన నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలలో తమ విద్యార్థులు ప్రతిభ చూపారన్నారు. అండర్ 14, 17 విభాగంలో వాలీబాల్, త్రోబాల్, టెన్నికాయిట్ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఆ విద్యార్థులను, ఫిజికల్ డైరెక్టర్ పి.చింతాలబ్బాయిని అభినందించారు.

ఆర్యాపురం బ్యాంక్ మహాజన సభ రేపు

రాజమహేంద్రవరం సిటీ: ది ఆర్యాపురం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ 104వ సాధారణ మహాసభను ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నట్టు బ్యాంక్ చైర్ పర్సన్ గిరజాల రామకృష్ణ తులసి తెలిపారు. బ్యాంక్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఖాతాదారులందరూ హాజరై జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. రూ.1094.55 కోట్లతో ఖాతాదారులకు సేవలు అందిస్తూ బ్యాంక్ ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ డైరెక్టర్లు మజ్జి నూకరత్నం, పతివాడ రమేష్‌బాబు, పెంకే సురేష్, యర్రా ప్రసాదరావు, బిల్డర్ చిన్నా, మార్గాని సురేష్, రాయుడు గణేష్, వెంట్రపాటి సురేష్, గొర్రిపాటి చినబాబు, సీతాఓ స్వరాజ్యలక్ష్మి పాల్గొన్నారు.